క్లుప్తంగా

గ్రామాల్లో వైద్య శిబిరాలు



గొల్లలపాలెంలో వైద్యసేవలందిస్తున్న సిబ్బంది

కొత్తవలస: మండలంలోని గొల్లలపాలెం,ఒడ్డిపేట గ్రామాల్లో వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యసిబ్బంది గురువారం వైద్య శిబిరాలు నిర్వహించారు. 65 మందికి వైద్యపరీక్షలు చేసి వారిలో ఎనిమిది మంది జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.హెల్త్ అసిస్టెంట్ సత్యారావు మాట్లాడుతూ వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

దస్తూరీ మెరుగుపడాలి



విద్యార్థులతో పాఠ్యాంశాలు చదివిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: విద్యార్థుల దస్తూరీ మెరుగుపడేలా వారికి హోంవర్కు ఇవ్వాలని ఉపాధ్యాయులకు ఎంఈఓ బాలభాస్కరరావు సూచించారు.ఆతవ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. పిల్లల వర్క్ బుక్స్, వారికి ఇచ్చిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను పరిశీలించారు. విద్యార్థులతో పాఠ్యాంశాలు చదివించి వారి విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాలు అందించాలని వంట నిర్వాహకులకు సూచించారు.

అయ్యంకి సేవలు మరువలేనివి



అయ్యంకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ శ్రీనివాస్,విద్యార్థులు

గంట్యాడ: గ్రంథాలయాల అభివృద్ధికి అయ్యంకి వెంకటరమణయ్య చేసిన సేవలు మరువలేనివని స్థానిక శాఖా గ్రంథాలయం అధికారి శ్రీనివాస్ అన్నారు.గ్రంథాలయం లో అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి గ్రంథాలయ అధికారితో పాటు పాఠకులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఏజీపీగా గిరిబాబు



గిరిబాబు

కొత్తవలస: స్థానిక జూనియర్ సివిల్ కోర్టు సహాయ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీ)గా ఎం.వి.ఎస్.గిరిబాబును నియమిస్తూ లీగల్ శాసన వ్యవహారాల కార్యదర్శి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. గిరిబాబు ఈ పదవిలో మూడేళ్లు కొనసాగునున్నట్లు పేర్కొన్నారు. గిరిబాబుకు పలువురు న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.

వీలుపర్తిలో పశువైద్య శిబిరం



పశువులకు చికిత్స చేస్తున్న డాక్టర్ గాయత్రి

వేపాడ: వీలుపర్తి గ్రామంలో వేపాడ పశువైద్యాధికారి కోరాడ గాయత్రి ఆధ్వర్యం లో గురువారం పశువైద్యశిబిరం నిర్వహించారు. 25 పశువులకు గర్భకోశ చికిత్సలు, పలు పశువులకు సాధారణ చికిత్సలు చేశారు. పశుపోషణలో తీసు కోవాల్సిన జాగ్రత్తలను పాడి రైతులకు వివరించారు.

ఆశ కార్యకర్త పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

బొండపల్లి: మండల కేంద్రంలో ఖాళీగా ఉన్న ఆశ కార్యకర్త పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తూ స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన 35 ఏళ్లలోపు ఉన్న స్థానిక మహిళలు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 26లోగా స్థానిక సచివాలయంలో లేదా పీహెచ్‌సీలో కాని దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

నేడు 'బాబు ష్యూరిటీ -మోసం గ్యారెంటీ'

లక్కవరపుకోట: మండలంలోని భీమాళి, దాసుళ్లపాలెం, గేదెలవానిపాలెం గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.ఉదయం 7.30 గంటలకు భీమాళి గ్రామంలో,9 గంటలకు గేదెలవానిపాలెంలో10 గంటలకు దాసుళ్లపాలెంలో కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మండల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ముందుకు సాగని వరినాట్లు..!

- చిటపట చినుకులే తప్ప భారీ వర్షాల జాడలేదు
- నీరులేక వెలవెలబోతున్న చెరువులు
- బోరుబావులు ఉన్నచోటే వరి నాట్లు
- ముదురుతున్న వరినారు..బోరుమంటున్న అన్నదాతలు



గజపతినగరం మండలం సాలిపేట గ్రామంలో నీరులేని చెరువు

గజపతినగరం వ్యవసాయశాఖ సబ్ డివిజన్ పరిధిలో ఖరీఫ్ వరి సాధారణ సాగు విస్తీర్ణం వివరాలు

మండలం	సాధారణ సాగు విస్తీర్ణం(హెక్టార్లు)	నాట్లు పూర్తయిన విస్తీర్ణం(హెక్టార్లు)
గజపతినగరం	3,691	330
బొండపల్లి	2,558	172
దత్తిరాజేరు	3203	44
మెంటాడ	3422	71

గజపతినగరం: మునుపెన్నడూ లేని విధంగా జూలై నెలలో విభిన్న వాతావరణ పరిస్థితులు ఉన్నాయి.మే నెలను తలపించేలా ఓవైపు ఎండతీవ్రత ఉంటోంది. అలాగే అడపాదడపా చిరుజల్లులు కురుస్తున్నాయి. చిటపట చినుకులే తప్ప భారీ వర్షాల జాడ కనిపించకపోవడంతో ఖరీఫ్ వరిసాగు చేయాలనుకునే రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ వరి నాట్లు వేసేందుకు సమయం దాటిపోతున్నా ఇంకా గజపతినగరం వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలో ఓ మోస్తారుగా కూడా వరి నాట్లు పూర్తి కాలేదు. వ్యవసాయ బోరు బావులు ఉన్న చోట తప్ప చెరువుల కింద ఎక్కడా ఇంకా నాట్లు పడలేదు. గజపతినగరం వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని గజపతినగరం, బొండపల్లి, దత్తిరాజేరు, మెంటాడ మండల్లాలో ఏటా ఖరీఫ్ వరి సాధారణ సాగు విస్తీర్ణం మొత్తం 12,874 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు కేవలం 617 హెక్టార్లలో మాత్రమే ఉభాలు జరిగాయి. ఈ సమ యానికి వరి నాట్లు 50 శాతానికి పైగా పూర్తి కావాల్సి ఉంది. కానీ వర్షాభావంతో వరి నాట్లు ముందుకు సాగడం లేదు.



మెంటాడ మండలం చల్లపేటలో బోరుబావులు ఆధారంగా వరి నాట్లు వేస్తున్న రైతులు

ఆశించిన స్థాయిలో కురవని వర్షాలు

వరి నారు పోసిన నాటి నుంచి అప్పుడప్పుడూ చిరుజల్లులు కురవడమే తప్ప చెప్పుకోదగని వర్షం కురవలేదని, నారును కాపాడుకోవడానికే నానా పాట్లు పడాల్సి వచ్చిందని రైతులు చెబుతున్నారు. గజపతినగరం వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలో సాగునీటి కాలువలు,బోరుబావులు ఉన్న చోట మాత్రమే ఉభాలు జరుగుతున్నాయి. వర్షాధారంగా వరి నాట్లు వేయాలనుకునే వారు ఆశగా ఆకాశం వైపు చూస్తున్నారు. నారు ముదురు పోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరుణుడు ముఖం చాటేసి, భానుడి ప్రతాపం ఇలాగే కొనసాగితే పంటకు నష్టం తప్పదని వరి నాట్లు వేసిన రైతుల్లో కూడా ఆందోళన కనిపిస్తోంది.

ఇంకా సమయం ఉంది



వరి నాట్లు వేసేందుకు ఇంకా సమయం ఉంది. రైతులు ఆందోళన చెందవద్దు. వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి. ఆగస్టు మూడో వారం వరకు నాట్లు వేసుకోవచ్చు. అన్నిగ్రామాల్లో శతశాతం ఉభాలు పూర్తవుతాయని భావిస్తున్నాం. వర్షాలు లేకపోతే ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, కంది,అపరాలు,తదితర పంటలు సాగు చేసుకునేలా విత్తనాలు సిద్ధం చేశాం. – పి.కిరణ్‌కుమార్, ఏఓ, గజపతినగరం మండలం

మూన్నాళ్ల ముచ్చటే..



చిత్రంలో కనిపిస్తున్నది కొత్తవలస మండల కేంద్రం నుంచి విజయనగరం జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి. కూటమి ప్రభుత్వం హడావుడిగా సంక్రాంతి పండగ సమయంలో లక్షల రూపాయలు వెచ్చించి ఈరోడ్డుకు మరమ్మతులు చేయించింది.అయితే మరమ్మతులు చేపట్టి పట్టుమని ఆరు నెలలు గడవక ముందే మళ్లీ రోడ్డు ఎక్కడికక్కడ గోతులు తేలింది. దీంతో ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. నాసిరకంగా పనులు చేపట్టడంపై మండిపడుతున్నారు. – కొత్తవలస

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం



వేపాడలోని రామాలయంవీధిలో మహిళలతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ సత్యనారాయణ

వేపాడ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే చాలా వరకు వ్యాధులకు దూరంగా ఉండవచ్చని జెడ్పీ సీఈఓ డి.వి.సత్యనారాయణ అన్నారు. మండలకేంద్రంతో పాటు, బక్కునాయుడుపేట గ్రామాల్లో గురువారం ఉదయం ఆయన పర్యటించారు.వీధి కాలువలు, నివాస పరిసరాలను, పారిశుద్ధ్య పనుల నిర్వహణను పరిశీలించారు. వేపాడ రామాలయం వీధిలో మహిళలతో మాట్లాడుతూ తాగునీటి ట్యాంకులను పంచాయతీ సిబ్బంది క్లీనింగ్ చేస్తున్నారా, కుళాయిల ద్వారా సకాలంలో తాగునీరు విడిచిపెడుతున్నారా లేదా అని ఆరా తీశారు. అలాగే గ్రీన్ అంబాసిడర్లు రోజూ ఇళ్లకు వచ్చి చెత్త సేకరిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. తాగునీటి వనరుల్లో వారానికొకసారి క్లోరినేషన్ చేయాలని సిబ్బందికి సూచించారు.ఆయన వెంట ఎంపీడీఓ సూర్యనారాయణ, పంచాయతీకార్యదర్శి శ్రీనివాసరావు,అంగన్‌వాడీ కార్యకర్తలు ,ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



బోరు మరమ్మతులకు సూచనలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో తాగునీటి సమస్యకు జెడ్పీటీసీ ప్రతినిధి, వైఎస్సార్‌సీపీ జిల్లా పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనువాసులనాయుడు పరిష్కారం చూపారు. ఎన్నో రోజులుగా కాలనీలో గల వాటర్ ట్యాంకు, బోరు పాడవ్వటంతో తాగునీటి కోసం స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను స్థానిక నాయకులు కోరుకొండ దాలయ్య, కనకరాజుతో పాటుగా మహిళలు జెడ్పీటీసీ ప్రతినిధి వలిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు స్పందించిన ఆయన నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణతో కలిసి అంబేడ్కర్ కాలనీకి వెళ్లి స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. పాడైన వాటర్ ట్యాంకు, బోరును స్థలాన్ని పరిశీలించారు. సంబంధిత సిబ్బందిని రప్పించి తక్షణమే బోరు మరమ్మతులు చేపట్టి తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇప్పిలి తిరుమల, గవిడి సురేష్, ప్రభాత్‌కుమార్, ప్రసాద్, వెంకీ, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

డీలర్ తొలగింపు కక్షపూరితం



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): పత్తికాయవలస గ్రామంలో పని చేసిన డీలర్‌ను సస్పెండ్ చేయడం కక్షపూరితమని వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. డీలరు తొలగింపును నిరసిస్తూ మండల పరిషత్ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ధర్మరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తికాయవలస గ్రామానికి చెందిన డీలరును నాలుగుసార్లు అధికారులు సస్పెండ్ చేశారని గుర్తు చేశారు. ఇదే విషయమై కోర్టుకు వెళ్లి ఆర్డర్ తీసుకువచ్చి డిపోను నిర్వహిస్తున్నాడని తెలిపారు. విధి నిర్వహణ సక్రమంగా చేస్తున్నా.. తహసీల్దార్, సీఎస్‌డీటీ కలిసి డీలరును సస్పెండ్ చేశారని ఆరోపించారు. అధికార పార్టీ నేతలు చెబితే తప్పు లేకున్నా సస్పెండ్ చేస్తారా? అని ప్రశ్నించారు. ఇప్పటికే మండలంలో ఏడుగురు డీలర్లను తొలగించారని గతంలో ఇలా కక్ష సాధింపు చర్యలు లేవని పేర్కొన్నారు. టీడీపీ నాయకుల ఒత్తిళ్ల వల్లే ఇలా అధికారులు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. టీడీపీ నేతలు గ్రామాల్లో కొత్త సంస్కృతికి తెర తీస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనువాసులనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, రైతు విభాగం ప్రతినిధి దన్నాన జనార్దన్, నాయకులు పతివాడ రాజారావు, అధికార్ల శ్రీనుబాబు, చందక గురునాయుడు, బాణాన శ్రీను, కొమ్ము చిరంజీవి, కంది పాపినాయుడు, రెల్లి వెంకటేష్, చింతాడ లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

వెంకటరమణయ్య జయంతి



వెంకటరమణయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్, పాఠకులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): చీపురుపల్లి శాఖా గ్రంథాలయంలో గురువారం అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని నిర్వహించారు. లైబ్రేరియన్ ఎం.ఉషారాణి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెంకటరమణయ్య గ్రంథాలయమే సర్వస్వం అనే పత్రికను నిర్వహించారని గుర్తు చేశారు. గ్రంథాలయ ఉద్యమంలో విశేష కృషి చేశారని, గ్రంథాలయ పితామహుడిగా పేరు పొందారన్నారు. ఆయన కృషికి ప్రభుత్వం పద్మశ్రీతో గౌరవించిందని కొనియాడారు.

మోసానికి మారు పేరు చంద్రబాబు

మోసం, వంచనకు మారుపేరు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని గజపతినగరం, ఎస్.కోట, చీపురుపల్లి నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. గజపతినగరం, బొండపల్లి, గంట్యాడ, వేపాడ, జామి, గరివిడి మండలాల్లోని పలు గ్రామాల్లో ఆయా మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుల ఆధ్వర్యంలో గురువారం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు.

ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు అండ్ -కో ఇచ్చిన ఎన్నికల హామీలను గుర్తు చేసి, వాటిని కూటమి ప్రభుత్వం అమలు చేసిందా అని మహిళలను ఆరా తీశారు. ఏటా ఒక్కో కుటుంబా నికి పథకాల ద్వారా రూ.1,05,000ల చొప్పున అందిస్తామని కూటమి పెద్దలు హామీ ఇచ్చారని, ఏ ఒక్క కుటుంబానికైనా ఆ డబ్బులు అందా యా అని ప్రశ్నించారు. చంద్రబాబు ఇచ్చిన ఏ హామీలూ అమలు కాలేదని, తమకు ఏ డబ్బులూ అందలేదని పలువురు మహిళలు నాయకుల వద్ద వాపోయారు.

☛ గజపతినగరం మండలంలోని తమ్మారాయుడుపేట, ఎం.గుమడాం, గుడివాడ గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, జెడ్పీటీసీ గార తవుడు, మండల నాయకులు కె.పైడప్పనాయుడు,బెల్లాన త్రినాథరావు పాల్గొన్నారు

☛ బొండపల్లి మండలంలోని ముద్దూరు, తమాటాడ, బిల్లలవలస గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ చల్లా చలంనాయుడు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు, సర్పంచ్ మునకాల పైడిపునాయుడు, ఎంపీటీసీ ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

☛ వేపాడ మండలంలోని ముకుందపురం,ఓబలయ్యపాలెం, బొద్దాం,పాటూరు, రామస్వామిపేట, పి.కె.ఆర్.పురం, కొండగంగుబూడి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మమ్ములూరి జగ్గుబాబు, జేసీఎస్ కన్వీనర్ బోజంకి శ్రీను, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు ఉగ్గిన శ్రీను, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



గజపతినగరంరూరల్ : గుడివాడలో చంద్రబాబు మోసాలను మహిళకు వివరిస్తున్న జెడ్పీటీసీ తవుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వెంకటరావు, నాయకులు



బొండపల్లి: ముద్దూరులో 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ 'కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు




గంట్యాడ: కొరారుబిల్లిలో కూటమి ప్రభుత్వం మోసాలను మహిళకు వివరిస్తున్న నరసింహమూర్తి, జైహింద్‌కుమార్, తదితరులు

☛ గంట్యాడ మండలంలోని నరవ, కొఠారుబిల్లి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్,పార్టీ మండల అధ్యక్షుడు జాగరపు అప్పారావు, ఉపాధ్యక్షుడు వర్రి మల్లయ్య,ఏఎంసీ మాజీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి జాగరపు సత్యారావు, గజపతినగరం నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఈదుబిల్లి రమేష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు కె.విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు వెంకటరావు, నరవ, కొఠారుబిల్లి సర్పంచ్‌లు పతివాడ భాస్కరరావు,వేమలి రమణమ్మ ఎంపీటీసీ మోపాడ అప్పలరాజు పాల్గొన్నారు.


☛ జామి మండలాల్లోని ఎం.కె.వలస,బలరాంపురం,ఏ.ఆర్.పేట గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొర్లె రవికుమార్, జెడ్పీటీసీ గొర్లె సరయు,ఎంపీపీ సబ్బవరపు అరుణ, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాండ్రంకి సంజీవి,'వైస్ ఎంపీపీ గేదెల వెంకటరావు, సంసర్పంచ్‌లు బి.దేవి,చెల్లూరి సూరిబాబు పాల్గొన్నారు.

☛ గరివిడి మండలంలోని అర్తమూరు,కొండదాడి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మీసాల విశ్వేశ్వరరావు, సర్పంచ్ పొన్నాడ కుమార్, మంత్రి నారాయణరావు, వైస్ ఎంపీపీ జి.శ్రీరాముల నాయుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఎలకల అప్పలనాయుడు, ఎంపీటీసీ యల్లంటి పోలీస్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.


– గజపతినగరం రూరల్/బొండపల్లి/గంట్యాడ /వేపాడ/ జామి /చీపురుపల్లిరూరల్(గరివిడి)



వేపాడ: బొద్దాంలో నిర్వహించిన 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు



జామి: ఎం.కె.వలసలో చంద్రబాబు ఎన్నికల హామీలను ప్రజలకు గుర్తు చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



చీపురుపల్లిరూరల్(గరివిడి): అర్తమూరులో చంద్రబాబు మోసాలను మహిళలకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సచివాలయ ఉద్యోగులకు సన్మానం



బదిలీపై వెళ్లిన సచివాలయ సిబ్బందిని సన్మానిస్తున్న గ్రామపెద్దలు

మెరకముడిదాం: మండలంలోని బుధరాయవలస సచివాలయంలో పని చేస్తూ ఇటీవల బదిలీపై ఇతర సచివాలయాలకు వెళ్లిన ఉద్యోగులను ఆ గ్రామానికి చెందిన పెద్దలంతా గురువారం సన్మానించారు. సచివాలయంలో ఆరేళ్ల పాటు సేవలందించిన 11 మంది సిబ్బందిని గ్రామపెద్దలు, యువత కలిసి దుశ్శాలువలతో సన్మానించి మెమెంటోలను అందజేశారు. గ్రామ సచివాలయంలో ప్రభుత్వం అమలు చేసిన ప్రతీ కార్యక్రమాన్ని ప్రజలకు చేరవేసేందుకు సచివాలయ సిబ్బంది కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ తమ్మినాయుడు, ఎంపీటీసీ సరిది గంగయ్య, బాలిమహేష్, రెడ్డి వెంకటి, సరిధి రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

చినబంటుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు రెడ్డి నారాయణరావు, ప్రసాద్, త్రివేణిలను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆల్తి రాంబాబు ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు



ప్రమాణ స్వీకారం చేస్తున్న పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గం

శృంగవరపుకోట: ఎస్.కోట యూనిట్ పంచాయతీరాజ్(పీఆర్) మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నికలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా జామి ఏఓ వి.నరసింహం, కార్యదర్శిగా డి.లత, సంయుక్త కార్యదర్శిగా టి.ఎల్లమ్మ, కోశాధికారిగా వి.గౌతం, జిల్లా కౌన్సిలర్లుగా బి.శ్రీధర్, జి.ప్రసాద్‌లను జామి, ఎస్.కోట, మండలాల పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఎన్‌జీఓ కార్యదర్శి ఆవు సురేష్, జిల్లా పంచాయతీరాజ్(పీఆర్) మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చింతాడ మురళి, జిల్లా యూనిట్ సభ్యులు ఆల్తి రమణమూర్తి, బొర్రా లక్ష్మణ్, కుమార్, ఎల్.వి.ప్రసాద్‌ల నేతృత్వంలో జరిగిన ఈ ఎన్నికలకు కె.బి.శ్రీనివాసరావు ఎలక్షన్ అధికారిగా వ్యవహరించారు.